
నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I హైదరాబాద్, బుధవారం 16 అక్టోబర్ 2024 | HYDERABAD

## కులీ కుతుబ్ షా.. ఉద్యోగుల వేతనాలు చెల్లించాలి

### అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఎంప్లాయీస్ యూనియన్



రవీంద్రభారతి, అక్టోబర్ 15: కులీ కుతుబ్ షా నగరాభివృద్ధి సంస్థ ఉద్యోగుల వేతనాలు తక్షణమే చెల్లించాలని కులీ కుతుబ్ షా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేకు బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూనియన్ అధ్యక్షుడు సయ్యద్ శంషాద్ ఖాద్రీ మాట్లాడారు. కులీ కుతుబ్ షా సంస్థకు చెందిన ఉద్యోగులకు మూడు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, తక్షణమే వేతనాలు విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. డిప్యుటేషన్‌పై ఉద్యోగులను వారి స్వస్థలాలకు పంపాలని, ఉన్న ఉద్యోగులందరికి పదోన్నతులు కల్పించాలని కోరారు. ఏటా బడ్జెట్‌లో కులీ కుతుబ్ షా నగరాభివృద్ధికి సంస్థకు 10 కోట్లు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మహ్మద్ హసన్, పి.ఆనంద్, సిద్ధప్ప పాల్గొన్నారు.



- క్షేత్రస్థాయి పరిశీలనల పేరిట పర్యటనలకు ఏర్పాట్లు
- నగరం నుంచి ఈ నెల 19న బయల్దేరనున్న భారీ బృందం
- దక్షిణ కొరియా-చియోంగ్ చియాన్ నది పరిశీలనకు అంతా సిద్ధం
- జాబితాలో మూసీ పరీవాహక ఎమ్మెల్యేలు, ప్రజా, స్వచ్ఛంద సంస్థలు

## దక్షిణ కొరియా పర్యటనకు బీఆర్ఎస్ దూరం

### మూసీ సోకుల కోసం విదేశాలకు ప్రజాధనం

సిటీబ్యూరో, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ): మూసీ ఆధునీకరణ పేరిట ప్రజాధనం విదేశాల్లో ఖర్చు చేసేందుకు కాంగ్రెస్ కసరత్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 19న దక్షిణ కొరియాకు హైదరాబాద్ నుంచి 50 మందికి పైగా ఉన్న బృందాన్ని తరలించేందుకు మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీ చర్యలు చేపట్టింది. ఈ బృందంలో మూసీ పరీవాహక ప్రాంత ఎమ్మెల్యేలు, ప్రజా, పర్యావరణ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో పాటు, పలు శాఖలకు చెందిన అధికారులు ఇందులో ఉన్నారు. ఇప్పటికే దక్షిణ కొరియాకు వెళ్లే బృందంలోని ప్రతినిధులకు వీసాలు కూడా ఖరారు కాగా.., అక్టోబర్ 19న జట్టుగా హైదరాబాద్ నుంచి బయలు దేరనున్నారు. అయితే, మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కానీ, క్షేత్ర స్థాయిలో ఇందుకు విమర్శలు పెద్ద ఎత్తున వెల్లువెత్తున్నాయి. ఈ క్రమంలోనే దక్షిణ కొరియా పర్యటనకు కసరత్తు చేశారని సమాచారం. ఆరు రోజుల పర్యటన కోసం ఎంఆర్‌డీసీఎల్ ఈ పర్యటనకు భారీ మొత్తంలో నిధులను ఖర్చు చేయనుంది. అయితే, పర్యటన వివరాలపై అధికారులు కూడా స్పందించలేదు. కానీ, జాబితాలో జీహెచ్ఎంసీ నుంచి మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, ఎంఆర్‌డీసీఎల్ నుంచి ఎండీ దానకిషోర్, జేఎండీ గౌతమి, ఈడీ శ్రీనివాస్ రెడ్డి, ఎస్ఈ దత్తు పంత్, ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ వెంకట శేఖర్‌లతో కూడా 21 మంది బృందంతో మరో 30 మందితో ఎన్జీవోలు, ప్రజా, పర్యావరణ కార్యకర్తలు ఉన్నట్టు ఎంఆర్‌డీసీఎల్ వర్గాల ద్వారా తెలిసింది.

#### భయభ్రాంతులకు గురి చేసేలా..

మూసీ పరీవాహక జనాలను మార్కింగ్, కూల్చివేతల పేరిట భయభ్రాంతులకు గురిచేసేలా కాంగ్రెస్ అమలు చేస్తున్న విధానాలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ ఈ విదేశీ పర్యటనకు దూరంగా ఉన్నట్లుగా తెలిపారు. బృందంలో ఉన్న ఎల్బీనగర్, ఉప్పల్, అంబర్‌పేట్ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్, బండారి లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్ పర్యటనను బాయ్‌కాట్ చేసినట్లుగా ప్రకటించారు. ఓ వైపు ఎలాంటి విధి విధానాలు, ప్రణాళికలు లేకుండానే మూసీ సుందరీకరణ పేరిట పేదల ఇండ్లను కూల్చుతూ, మరో వైపు అధ్యయనాల పేరిట విదేశాలకు తీసుకెళ్లడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. గతంలో చేసిన అధ్యయనాలు, చేసిన పర్యటన నివేదికలను పరిగణనలోకి తీసుకోకుండా.., ఇప్పుడు కొత్తగా చేస్తున్న పర్యటనతో జనాలకు ఒరిగేదేమీ లేదంటున్నారు. ప్రజాధనాన్ని విదేశాల్లో ఖర్చు చేయడమే తప్పా.. మూసీ పరీవాహక జనాలకు ఏ ప్రయోజనం ఉండదని భావిస్తున్నారు. మూసీ ప్రక్షాళనలో ప్రభుత్వంపై విధానపరమైన విభేదాలు ఉన్నాయని, ప్రజాధనాన్ని లూటీ చేసేలా ఉన్న ఈ పర్యటనను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తోంది. బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ కూడా మూసీ పర్యటనను వ్యతిరేకించారని సమాచారం.

#### పేదల ఇండ్లను కూల్చి.. విదేశాలకు నేతలు

నగరంలో పేదల ఇండ్లను కూల్చివేయడంపై కాంగ్రెస్ పార్టీపై ప్రజలు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. రివర్ బెడ్ ఆక్రమణల గుర్తింపుతోనే పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షలాది మంది పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన నిర్మాణాలను కూల్చి, రోడ్డున పడేస్తున్న క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తున్నారు. ప్రక్షాళన విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో పర్యావరణానికి హాని చేసేలా ఉందనే వాదనలున్నాయి. అన్ని పార్టీలను మూసీ పేరిట బద్నాం చేసేలా అఖిల పక్ష నేతలను బృందంలో చేర్చారనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో మూసీ పరీవాహక జనాల నుంచి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సందర్భంగా, ఈ పర్యటనలో భాగస్వామ్యం కాకపోవడమే మంచిదనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. పేదల ఇండ్లను కూల్చి ప్రజాప్రతినిధులను విదేశాల్లో తిప్పాలనుకోవడం సరి కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



*మూసీ నది పరీవాహక ప్రాంతంలో ప్రభుత్వం మరో మారు కూల్చివేతలు చేపట్టేందుకు సన్నద్ధమైంది. ఇప్పటి వరకు మొదటి దఫా జరిగిన విషయం తెలిసిందే. కాగా, పండుగ నేపథ్యంలో కూల్చివేతలకు ఫుల్‌స్టాప్ పెట్టినట్టే పెట్టి, కూల్చివేతల కొనసాగింపు చర్యలు చేపట్టేందుకు రంగ సిద్ధం చేసింది. పేదల ఇండ్లపైకి బుల్డోజర్లను ఉసిగొల్పేందుకు రెండో దఫా ధ్వంస రచన చేసింది. అయితే, నగరంలో 55 కిలో మీటర్ల విస్తరించిన మూసీ పరీవాహకంలో 2100ల అక్రమ నిర్మాణాలున్నట్టు జిల్లా అధికార యంత్రాంగం గుర్తించింది. ఇదిలా ఉండగా, దీపావళి పండుగ అనంతరం, మూడో దఫా సైతం కూల్చివేతలు చేపట్టేందుకు వ్యూహం సిద్ధం చేసినట్టు తెలిసింది.*

# పేదల ఇండ్లపైకి బుల్డోజర్లు





### కూల్చివేతలకు రంగం సిద్ధం
### రెండో దఫాకు సన్నాహాలు

దీపావళి తరువాత మరో వ్యూహం అమలుకు అధికారుల కసరత్తు

జిల్లా అధికారులతో ఎంఆర్‌డీసీఎల్ సమన్వయ సమావేశాలు

సిటీబ్యూరో, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ): మూసీ వెంబడి మరో దఫా కూల్చివేతలకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే కూల్చివేతల బాధ్యతలను జిల్లా అధికారులకు అప్పగించి చేతులు దులుపుకున్న మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ అథారిటీ.., ఇక రెండో దశలోనూ పేదల ఇండ్లపైకి బుల్డోజర్లను ఉసిగొల్పనుంది. మూసీ ఆక్రమణలను తొలగిస్తామని, ప్రాజెక్టు విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదంటూ చకచకా కూల్చివేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే రివర్ బెడ్ ప్రాంతంలో దాదాపు 2100 నిర్మాణాలు ఉన్నట్లుగా గుర్తించారు. వాటన్నింటినీ దశల వారీగా ఈ నెలాఖరులోగా కూల్చివేసిన వెంటనే, దీపావళి తర్వాత మూడో దఫా ఆక్రమణలు, నిర్మాణాల గుర్తింపు, కూల్చివేతలకు కసరత్తు మరో మారు చేపట్టేందుకు వ్యూహరచన చేస్తున్నట్టు తెలిసింది.

#### నగరంలో 55 కిలోమీటర్ల మేర..

హైదరాబాద్ నగరంలో 55 కిలోమీటర్లు మేర విస్తరించిన మూసీ నదికి ఇరువైపులా రెండోసారి కూల్చివేతలు చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఆయా జిల్లాల వారీగా ఇప్పటికే సేకరించిన సోషియో ఎకానమిక్ సర్వే, ముందుగానే గుర్తించిన రివర్ బెడ్ మ్యాపుల ఆధారంగా నిర్మాణాలను మూసీలో కలపనున్నారు. రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల రెవెన్యూ, ఇరిగేషన్ మ్యాపులతో క్రోడీకరించిన మార్గాల వారీగా మార్కింగ్ చేశారు. వాటన్నింటినీ దశల వారీగా కూల్చేయనున్నారు. ఇప్పటికే మూడు జిల్లాల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో ఎంఆర్‌డీసీఎల్ సమన్వయ సమావేశం కూడా పూర్తి చేసింది. ఇక కూల్చివేతలను జిల్లా యంత్రాంగమే పర్యవేక్షించాలని మూసీ అథారిటీ ఆదేశాలు జారీ చేసింది.

#### లెక్కకు మించి నిర్మాణాలు..

దశల వారీగా మూసీ వెంబడి నిర్మాణాలను కూల్చివేస్తోంది. ప్రస్తుతం మూసీ రివర్ బెడ్ ప్రాంతంలోని నిర్మాణాల గుర్తింపు, మార్కింగ్, కూల్చివేతలను చేపట్టనుంది. అయితే, జిల్లా అధికారులు గుర్తించినట్లుగా మూడు జిల్లాల పరిధిలో 2100 కంటే ఎక్కువ ఉన్నట్లుగా రెవెన్యూ, ఇరిగేషన్ మ్యాపుల ద్వారా తెలిసింది. కూల్చివేతలపై ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకే సమన్వయ సమావేశం నిర్వహించినట్లుగా ఎంఆర్‌డీసీఎల్ వర్గాలు తెలిపాయి. రివర్ బెడ్ నిర్మాణాల కూల్చివేతలు పూర్తి కాగానే, ఎఫ్ఆర్ఎల్ పరిధిలో ఉన్న ఆస్తులు, నిర్మాణాలు, కట్టడాలను గుర్తించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రధానంగా కోర్టు వ్యవహారాలతో కూల్చివేతలకు ఆటంకం లేకుండా ఉండేలా తగిన ఆధారాలు సమకూర్చుకోవాలని సూచించినట్లు తెలిసింది.



## లే అవుట్లపై సర్కారు కన్ను!

### చెరువుల హద్దుల నిర్ధారణకు కసరత్తు

తొలుత నోటీసులు.. తర్వాత పరిశీలన ● 'మేడ్చల్' జిల్లా యంత్రాంగం సిద్ధం

మేడ్చల్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): చెరువుల సమీపంలో ఉన్న లే అవుట్ల పరిశీలనకు జిల్లా యంత్రాంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలోని చెరువుల సమీపంలో ఉన్న లే అవుట్ల వివరాల సేకరణ చేస్తున్నట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికే చెరువుల సమీపంలోని బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ హద్దుల గుర్తింపునకు సర్వేను కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే చెరువుల సమీపంలో అనుమతి ఇచ్చిన లే అవుట్లను పరిశీలించి బఫర్ జోన్ లేదా ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయా? అన్న దానిపై పరిశీలించనున్నారు. బఫర్ జోన్, లేదా ఎఫ్‌టీఎల్‌లో అనుమతులు ఇచ్చినట్లయితే ఎలాంటి చర్యలు ఉంటాయన్న దానిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనన్న ఆందోళనలు చెందుతున్నారు. అయితే, చెరువుల సమీపంలో ఉన్న లే అవుట్ల యజమానులకు నోటీసులు ఇచ్చి లే అవుట్లను పరిశీలించే అవకాశం ఉందని సమాచారం.

#### జిల్లాలో 97 చెరువుల బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ హద్దుల గుర్తింపు..

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా 97 చెరువులు ఉండగా, ఇప్పటి వరకు 97 చెరువుల బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ హద్దుల గుర్తింపును పూర్తి చేశారు. మరో 110 చెరువుల బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ హద్దుల గుర్తింపునకు సర్వేను కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. త్వరలోనే 413 చెరువుల సర్వేను మూడు నెలల్లో పూర్తి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా చెరువుల బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ హద్దుల గుర్తింపు, అనంతరం, ఆక్రమణలకు గురి కాకుండా ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. చెరువుల సమీపంలో ఉన్న లే అవుట్ల పరిశీలనకు ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి 97 చెరువుల సమీపంలో పరిశీలన జరపనున్నట్లు విశ్వసనీయ సమాచారం.



## 584 మంది కొత్త ఉపాధ్యాయులకు పోస్టింగ్

సిటీబ్యూరో, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ కొత్త ఉపాధ్యాయులైన 584 మందికి హైదరాబాద్ జిల్లాలో పోస్టింగులు లభించాయి. అభ్యర్థులకు మంగళవారం కౌన్సెలింగ్ ప్రక్రియ ద్వారా విద్యాశాఖ పోస్టింగులు కేటాయించింది. జిల్లాలో 878 పోస్టులకు గాను కోర్టు కేసులు, రిజర్వేషన్ల కేటగిరిలో అభ్యర్థుల కొరత, ఇన్ సర్వీస్ తదితర కారణాలతో సుమారు 262 మంది పోస్టులకు అభ్యర్థుల ఎంపిక పెండింగులో పడింది. మిగతా 6161 పోస్టులలో అభ్యర్థులను ఎంపిక చేసినప్పటికీ ధ్రువీకరణ పత్రాలు రీ వెరిఫికేషన్‌తో 32 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు నిలిపివేశారు. మంగళవారం 585 మంది అభ్యర్థులు మాత్రమే నియామక పత్రాలను అందుకున్నారు. ఇందులో 386 ఎస్జీటీ, 107 ఎస్ఏ, 91 ఎల్‌పీ అభ్యర్థులకు పోస్టింగులు లభించాయి.

## విగ్రహ ధ్వంసంపై దర్యాప్తు ముమ్మరం

- ముంబైకి వెళ్లిన ప్రత్యేక బృందం
- దవాఖానలో విచారణకు సహకరించని నిందితుడు
- నేడు ఈ ఘటనపై పోలీసుల నుంచి స్పష్టత వచ్చే అవకాశం

సిటీబ్యూరో, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ): సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహన్ని ధ్వంసం చేసిన ఉన్మాది సలీం బ్యాగ్రౌండ్‌ను తెలుసుకోవడంపై సిటీ పోలీసులు దృష్టి సారించారు. ఇతనిపై ముంబైలో ఇలాంటి ఘటనలకు సంబంధించిన రెండు కేసులు నమోదయ్యాయని గుర్తించిన పోలీసులు, ఆ కేసులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవడంపై దృష్టి పెట్టారు. ఇందులో భాగంగానే ఎవరీ సలీం? అనే విషయంలో స్పష్టత కోసం ముంబైకి ప్రత్యేక బృందాలు వెళ్లాయి. అక్కడ పాత కేసులలోని పూర్వాపరాలు తెలుసుకోవడంతో పాటు ఇతని గత చరిత్రను తవ్వేందుకు అవకాశాలున్నాయని తెలుస్తుంది. ఇదిలా ఉండగా, నిందితుడు నిమ్స్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు, అయితే, పోలీసుల విచారణకు సహకరించడం లేదని తెలిసింది. ఉన్మాదిగా పెద్దగా అరుస్తూ కేకలు పెడుతూ వైద్య బృందాన్ని భయాందోళనకు గురిచేస్తున్నట్లు తెలిసింది. అయితే, సాధారణంగా మతపరమైన దాడులు జరిగినప్పుడు ఉన్మాదిగా మారే వ్యక్తులు, దాడులకు పాల్పడే వారు మానసిక పరిస్థితి బాగోలేని వారేనని చివరకు తేలుతుంది. ఈ ఘటనలోను అలాంటి పరిస్థితే ఉంటుందా? అనే అనుమానాలు సైతం నగర ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఈ ఘటనకు సంబంధించిన అన్ని కోణాలలో దర్యాప్తు జరుపుతున్నామని త్వరలో అన్ని అంశాలతో స్పష్టత ఇస్తామంటూ నార్త్‌జోన్ డీసీపీ రష్మిపెరుమాల్ వెల్లడించారు.



## డీడీల తయారీలో జాప్యమెందుకు?

వేగంగా పాఠశాలలకు పంపించండి ● కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీబ్యూరో, అక్టోబర్ 15(నమస్తే తెలంగాణ): పాఠశాలలకు వెంటనే డ్యూయల్ డెస్కును పంపించాలని, తయారీలో ఎందుకు జాప్యం జరుగుతుందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆరా తీశారు. చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో తయారవుతున్న డ్యూయల్ డెస్కుల తయారీ కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ తయారవుతున్న డ్యూయల్ డెస్కులను పరిశీలించి, అర్డర్ ఇచ్చి రెండు నెలలవుతుందని, ఇప్పటి వరకు డెస్కులను ఎందుకు అందజేయడం లేదని, ఎన్ని సరఫరా చేశారు? ఇంకా ఎన్ని చేయాల్సి ఉంది? అనే విషయాలను అక్కడున్న అధికారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. జాప్యం లేకుండా త్వరగా పాఠశాలలకు క్వాలిటీ కంట్రోల్ నిర్వహించి వెంట వెంటనే పాఠశాలలకు డెస్కులు సరఫరా చేయాలని, ప్రతి రోజు ఎన్ని డెస్కులు పంపిస్తున్నారనే వివరాలు తనకు పంపించాలని కలెక్టర్ సూచించారు. కాగా, అంతకు ముందు చంచల్‌గూడలోని డిగ్రీ కళాశాల ఆవరణలో రూ. 5 కోట్లతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాలతో కలిసి పరిశీలించారు. పనులలో వేగం పెంచాలని కాంట్రాక్టర్‌ను, కళాశాల విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలంటూ ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.



చంచల్‌గూడ జైలులో డ్యూయల్ డెస్కుల తయారీని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్, పోలీసు అధికారులు

## ఏడేండ్ల బాలిక కిడ్నాప్.. హత్య!

- సూరారం పీఎస్ పరిధిలో ఈ నెల 12న అదృశ్యం
- మేడ్చల్-బాసరగడిలో గోనెసంచిలో బాలిక మృతదేహం
- పోలీసుల అదుపులో నిందితుడు

వివరాలు మెయిన్‌లో...

## యువతిపై అర్ధరాత్రి లైంగిక దాడి

- ఉలిక్కిపడ్డ గచ్చిబౌలి ఐటీ కారిడార్
- మై ఆటో ఈజ్ సేఫ్‌ను మరిచిన పోలీసులు
- నిఘా వైఫల్యంతో ఘటన - అదుపులో ఆటో డ్రైవర్



## ఐటీ సెక్టార్‌లో ట్రాఫిక్ జామ్

గచ్చిబౌలి - రాయదుర్గం - మాదాపూర్ ఐటీ సెక్టార్ మంగళ వారం తీవ్ర ట్రాఫిక్ స్తంభనలతో ఉక్కిరి బిక్కిరయ్యింది. ఇటు రాయదుర్గం - బయో డైవర్సిటీ నుంచి ఐకియా, ఏట్రియం గచ్చిబౌలి, మైండ్ స్పేస్, మాదాపూర్ వరకు వేలాది వాహనాలు ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయాయి. ఎటువైపు చూసినా వాహనాలే.. వాహనాలు. ఫ్లై ఓవర్‌పైన, కింద వేలాదిగా వాహనాలు ఆగిపోయాయి. కాగా, గంటల తరబడి వాహనాలు రద్దీలో నిల్చిపోయాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.